


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

**మనిషికి ఎంతో** పరువైన శృంగారమే అక్కడ విశృంఖలమైంది. ఇక వీధిలో తప్ప తాగినవారుంటారని వేరే చెప్పాలా?

రాత్రంతా ఆ వీధిలో ఒకటే సందడి. వచ్చినవారిలో యాత్రీకులే ఎక్కువ. వారిలో వివిధ దేశాల వారున్నారు. ఆశ్చర్యమేమిటంటే ఆ యాత్రీకుల్లో చిన్నపిల్లలున్నారు. టీనేజి ఆడపిల్లలున్నారు. చంటిపిల్లల్ని తోపుడుబళ్లలో ఉంచి, ఆ బళ్లను తోసుకుంటూ తిరుగుతున్న మాతృమూర్తులు కూడా ఉన్నారు.

న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి అనగల దేశంనుంచి వచ్చిన నాలో, అక్కడి విచ్చలవిడితనం ఏవగింపు కలిగించలేదు. జాతి, వర్ణ, లింగ భేదమెరుగని – ఆంక్షలు లేని ఆ స్వేచ్ఛ నన్ను అబ్బురపరచింది. మన దేశంలో ఇదే వీధి, ఇదే సదుపాయాలతో ఏ నగరంలోనైనా ఉంటే? పురుషలోకం ఇంత సమన్వయంగా వ్యవహరించగలదా? ఈ స్వేచ్ఛని నిరసించేవారు కూడా, ఆ స్వేచ్ఛ ఆ దేశపు ప్రగతికి ఏవిధంగానూ ప్రతిబంధకం కాలేదని ఒప్పుకోగలరు.

ఏదిఏమైనా ఆ రోజు హాంబుర్గ్ సందర్శనం మనసులో రేపిన అలజడి, జీవితకాలం వెంటాడేదే. కానీ సెప్టెంబర్ 1న అంకుల్ విల్లీ ఏర్పాటు చేసిన ల్యూనబర్గర్ హైడే యాత్ర పైదానికి పూర్తిగా భిన్నం.

ల్యూనబర్గర్ హైడే ల్యూనబర్గ్‌కి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ విశాలమైన మైదానముంది. దానిమీదకి మోటారు వాహనాలు అనుమతించరు. వీలైనంతవరకూ నడిచే చూడాలి. ఆగస్ట్‌లో వేసవి మొదలవగానే, ఆ మైదానమంతా పుష్పభరితమౌతుందిట. ఆగస్ట్–సెప్టెంబర్ మధ్యలో నేలంతా ఊదారంగు గడ్డిపూలతో నిండి, చూడ్డానికి ఊదారంగు తివాచీ పరిచినట్లుందట. అది చూడాలని మేమంతా చాలా కుతూహలపడ్డాం.

ఎందరో విదేశీయులతో పాటు పదిహేనుమందిమి భారతీయులం ఉన్నాం. బస్సు ల్యూనబర్గ్ మార్కెట్ సెంటర్నించి 9.30కి బయల్దేరి, 10.10కల్లా అక్కడకు చేర్చింది. దిగీ దిగగానే నడక మొదలు. నేను, నటరాజన్, రామచంద్ర, కొరియా, దేవ్‌దార్, తెలుగు జోసెఫ్ (కేరళనుంచి వచ్చిన ఇంకో జోసెఫ్ ఉండడంవల్ల ఇతన్ని తెలుగు జోసెఫ్ అనేవాళ్లం. వీళ్లిద్దరూ ఇండియానుంచి ఓ క్రైస్తవసంస్థ పనుపున జర్మన్ భాష నేర్చుకుందుకు వచ్చారు. తెలుగు జోసెఫ్ఎ క్కువగా మాతో తిరిగేవాడు) ఒక జట్టుగా ఉన్నాం.

చిన్నప్పట్నించీ బాగా అలవాటేమో, నడక నాకు చాలా ఉత్సాహంగా అనిపించింది. ఎంత నడిచినా మైదానమే తప్ప ఇంకేం లేదు. ఆరంభంలో నేలమీద ఎండిన గరికగడ్డి లాంటి చిన్న చిన్న పొదలు తప్ప మరేమీ కనిపించక కొంత నిరుత్సాహం కలిగింది. కానీ విదేశంలో పేరుపడ్డ యాత్రాస్థలం. ఉత్తినే దేన్నీ వాళ్లు మెచ్చుకోరని నమ్మకం. అందుకని ఎక్కడైనా నేలమీద నాలుగైదు ఊదారంగు పూలు కనబడగానే ఆగిపోయి, "ఆహా, ఎంతబాగుందో" అనేవాళ్లం. కొంచెం ఫీలింగ్. కొంచెం జోకింగ్.

అలా ఒకసారి రామచంద్ర అన్నప్పుడు, మా పక్కనే ఉన్న ఓ జర్మన్ నడివయస్కుడు మమ్మల్ని చూసి జాలిపడి, "దీనికే ఇంత థ్రిల్లయిపోతున్నారు. మొత్తం నేలంతా ఊదారంగులో ఉంటే ఏమైపోయేవారో" అన్నాడు.

"అది లేకే ఇలా సద్దుకుపోతున్నాం" అన్నాడు నటరాజన్ హిందీలో. మేము నవ్వుకున్నాం.

అలా నడవగా నడవగా, నేలమీద పూల సంఖ్య పెరిగింది. టూరిస్ట్ గైడ్ పుస్తకంమీద గౌరవముంటే, ఊదారంగు తివాచీని ఊహించుకుని సరిపెట్టుకునేలాగే ఉంది. చాలా అందంగా ఉన్నట్లూ అనిపించింది. ఎంత దూరం నడిచామో కానీ చివరకు ఓ కొండ వస్తే పైకెక్కాం. దానిమీద ఓ పెద్ద రాతి పలకమీద – ప్రపంచ దేశాల ముఖ్యపట్టణాల పేర్లూ, అవి ఏ దిక్కులో ఎంత దూరంలో ఉన్నాయో సూచనా ఉన్నాయి. మాతో వస్తున్న ఓ బ్రిటిష్ అమ్మాయి జోన్స్అక్కడ ఆగి వివరాలు శ్రద్ధగా చదివి, వాటిలో పెకింగ్ పేరు కూడా ఉన్నదనీ, మా ల్యూనబర్గ్ అక్కడికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్నదనీ కనిపెట్టింది. బస్సు దిగినప్పట్నించీ వదలకుండా ఆమెనే అనుసరిస్తూ వస్తున్న ఓ అబ్బాయి వెంటనే, 'బ్రిటిష్అమ్మాయిల తెలివే తెలివి అని అభినందించాడు. ఆ పొగడ్త కూడా, ల్యూనబర్గర్ హైడేపై మా పొగడ్తలాగే ధ్వనించినా – ఆమె మాత్రం అభినందనగానే స్వీకరించి ఎంతో అందంగా సిగ్గుపడింది. అప్పుడు నేనోసారి చుట్టూ నేలని చూశాను. మా పొగడ్తలకు కలిగిన సిగ్గువల్లనేమో, నేలకూడా ఆ అమ్మాయంత అందంగానూ ఉంది.

ఆ క్షణంనుంచీ నా దృష్టి జోన్స్‌మీద పడింది. రంగు పక్కన పెడితే, నాకు భుజాలదాకా మాత్రమే వస్తున్న ఆమె అచ్చం ఇండియన్ అమ్మాయిలా అనిపించి పలకరించాను. ఆమె కూడా స్నేహపూర్వకంగా స్పందించింది.

ఓ కిలోమీటరు దూరం నడిచి ఓ మ్యూజియం చూశాం. దానికి టికెట్ 30 ఫెనిగ్స్. లోపల పాత కాలపు కుర్చీలు, బల్లలు, గిన్నెలు వగైరాలున్నాయి. కొన్ని క్రీస్తుకి శతాబ్దాల క్రితంవని కూడా రాసుంది. స్వతహాగా నాకు మ్యూజియాలంటే భయం. లోపల నా నడక పరుగులా మారింది. నా మిత్రులు టికెట్ డబ్బుకి న్యాయం చెయ్యాలనుకున్నారో, వాళ్లకి నిజంగానే ఆసక్తిగా ఉందో మరి – నేను వారికంటే చాలా ముందొచ్చేశాను.

ఒంటరినయ్యేనా అనుకున్నాను కానీ, నా పక్కన జోన్స్ కనబడింది. మేమిద్దరం కాసేపు మాట్లాడుకున్నాం.

ఆమె అసలుసిసలు బ్రిటిష్అమ్మాయి. మాటల్లో ప్రపంచాధినేతలమన్న రాజసముంది. ఇండియన్ని ఐనా నన్ను బానిసలా చూడకపోవడం నా అదృష్టం. వెంటబడి తనని ఇంప్రెస్ చెయ్యాలనుకునే అబ్బాయిలంటే ఆమెకి ఏవగింపు ఉన్నట్లుంది. ఆ విషయమై నేను విభిన్నమని మెచ్చుకుంది. ఆ మెప్పు యథాలాపంగా ఉంది. ఇంగ్లీషు ప్రసక్తి వచ్చి, జర్మన్సు ఇంగ్లీషు మాట్లాడినా అర్థం చేసుకుందుకు కష్టపడాలంది.

"ఇండియాలో ఉన్నతవిద్య అంతా ఇంగ్లీషులోనే ఉంటుంది. మాకు అన్ని దేశాలవారి ఇంగ్లీషూ బాగానే అర్థమౌతుంది. ఒక్క అమెరికన్ ఇంగ్లీషు విషయంలోనే కాస్త ఇబ్బంది. రేడియోలో వాయిస్ ఆఫ్ ఆమెరికా ఫాలో అవగలం కానీ, బయట అమెరికన్స్ మాట్లాడితే అర్థం చేసుకుందుకు కష్టపడాలి" అన్నాను.

"మరి నా ఇంగ్లీషు?" అందామె వెంటనే. అప్పుడామె ముఖంలో పసితనం కనిపించింది.

"నీ ఇంగ్లీషు స్పష్టంగా అర్థమౌతుంది. మరి నా ఇంగ్లీషు?" అన్నాను తనే అవకాశం ఇచ్చింది కదా అని.

"కొంచెం కష్టపడాలి. కానీ ఫరవాలేదు" అంది, నిజం చెప్పడానికి కొంచెం ఇబ్బంది పడుతున్నట్లు.

తర్వాత టాపిక్ ల్యూనబర్గర్ హైడే మీదకి మళ్లింది. ఆమె కూడా నాకులాగే అనుకుంటోంది.

"కొన్ని ప్రదేశాలు చూసి ఆనందించాలి. ఇది విని ఆనందించాల్సిన ప్రదేశం" అన్నాను. ఆమె ముందు చిన్నగా నవ్వింది. తర్వాత ఆగకుండా నవ్వింది. ఆమె అలా నవ్వుతుండగా, మా మిత్రులు వచ్చారు. ఆ నవ్వు చూసి అప్రయత్నంగా నాకు కన్ను గీటారు. ఏమిటి – వ్యవహారమన్నట్లు!

ఆమె నవ్వు ఆగిపోయింది.

"ఇందుకా, నువ్వు హడావుడిగా వెళ్లిపోయావ్!" అన్నాడు కొరియా నన్ను కొంటెగా చూస్తూ.

నాకు ఇబ్బందిగా అనిపించింది. మాది ఇండియన్ కల్చర్. అదిక్కడ బయటపడ్డం నాకిష్టం లేదు. "లోపల ఏం చూశారో చెప్పండి. నేనేం మిస్సయ్యానో తెలుసుకుంటాను" అన్నాను మాట మార్చుతూ.

"నువ్వేం మిస్ కాలేదు. మేమే మిస్సయ్యాం" అన్నాడు నటరాజన్ నర్మగర్భంగా.

జోన్స్‌కి మా సంభాషణ అర్థం కాలేదు. నావంక ప్రశ్నార్థకంగా చూసింది. "చూడాల్సినవి చాలా ఉన్నాయిట. మిస్సయ్యానంటున్నారు" అన్నాను.

"మళ్లీ లోపలికెడదామా?" అందామె ఉత్సాహంగా.

"కొన్ని వినే ఆనందించాలి. ల్యూనబర్గ్ వెళ్లేక వాళ్లని అడిగి వింటాన్లే" అని ఆమెను వదిలి మిత్రబృందంతో కలిశాను.

అక్కణ్ణించి ఓ కిలోమీటర్ దూరంలో టోటెన్ గ్రుండ్‌ఉంది. చూడ్డానికేం లేదు. మేము కూడా తెచ్చుకున్నవి తినడానికి సిద్ధపడుతున్నాం. అంతలో గెసుండ్ గుప్తా వచ్చి మాతో కలిసాడు. తను ఏం తెచ్చుకోలేదుట. ఎవరో ఒకరు తెచ్చుకోకపోరు, వాళ్లతో కలవొచ్చులే అనుకున్నాట్ట. అతను అనుకున్నట్లే జరిగింది. అంతా కలిసి సరదాగా తిన్నాం. రామచంద్ర తెచ్చిన ఉప్మా ఉఫ్ అని ఊదేసేలా ఉంది. దేవదార్ రవ్వతో సత్యనారాయణ ప్రసాదం లాంటిది అంత బాగానూ చేసి తెచ్చాడు. ఇంకా అన్నం ప్యాకెట్లు, పెరుగు, చిప్స్. గుప్తా కారణంగా తెచ్చుకున్నవి పూర్తిగా సరిపోలేదు. కానీ ఎవరూ అందుకు విచారించలేదు. ముందుగా చెప్పిఉంటే కాస్త ఎక్కువ తెచ్చేవాళ్లమని దేవ్‌దార్‌అనుకున్నాడు. విచిత్రమేమిటంటే, కూడా ఏం తెచ్చుకోకుండా తనలా మాతో కలిసినందుకు గుప్తా మొహమాటంతో కొంచెం సిగ్గుపడ్డాడు. అది పోగొట్టడానికి మేమందరం మనస్ఫూర్తిగా ప్రయత్నించాం.

ఆ తర్వాత మళ్లీ నడక. ఈసారి కాస్త పెద్ద పెద్ద తివాచీలే కనిపించాయి. వాన్నింటినీ కలిపి ఒకే తివాచీగా ఊహించుకుంటే, ఓహ్, అనిపించింది. ఇంకా అక్కడ రకరకాల పూలు కూడా కనిపించాయి. ఎగతాళి భావన లేకుండా, ప్రకృతి సౌందర్యం కనులవిందు చేస్తూ, మేను పులకరింపజేసింది. మాతో వచ్చిన కొందరు పూలు కోసుకున్నారు. అది చూసి నిర్వాహకులు, పూలు కొయ్యడంలో పోటీ పెట్టారు. జోన్స్ అందులో చాలా ఉత్సాహంగా పాల్గొంది. పోటీలో నెగ్గిన నలుగురిలో ఆమె కూడా ఉండడం నాకెంతో సంతోషం కలిగించింది. ఆటలో అసమదీయులు నెగ్గాలనుకోవడం సహజం కదా!

రోజంతా వాన లేకుండా ఎండ కాయడం, ఆ ఎండ కూడా వంటికి ఆహ్లాదంగానూ, ఫొటోగ్రఫీకి అనుకూలంగానూ ఉండడం ఆ రోజు విశేషం. సాయంత్రం 5.15కి మళ్లీ బస్సెక్కి 6 కాకుండా ల్యూనబర్గ్ చేరుకున్నాం. ఇల్లు చేరేసరికి యాకేల్‌కి బిపి కాస్త పెరిగిందని తెలిసి నొచ్చుకున్నాను. ఆమె మాత్రం ప్రయాణమెలా జరిగిందని అడిగి తినమని కేక్‌ఇచ్చింది. కేక్‌ఎలా ఉన్నా ఆమె ఆప్యాయతని ఆస్వాదించాను. ఆశ్చర్యమేమిటంటే, రోజంతా నడుస్తూనే ఉన్నా ఏమాత్రం అలసట అనిపించలేదు.

ల్యూనబర్గులో మా చివరి పిక్నిక్ సెప్టెంబర్ 19న ల్యూబెక్‌కి వేసుకున్నాం. ఆ రోజు వినాయకచవితి. భక్తి విషయమెలాగున్నా సంప్రదాయంలో అలవాటుగా ఆ రోజునైనా లేచీ లేవగానే స్నానం చెయ్యాలనుకున్నాను. కానీ ఇంట్లో ఆ సదుపాయం లేదు. ల్యూబెక్ చేరేక అక్కడ స్నానం చేద్దామని రామచంద్ర ముందురోజే చెప్పాడు. అంతవరకూ ఏమీ తినకూడదనే ఉద్దేశ్యంతో బ్రేక్‌ఫాస్ట్ చెయ్యలేదు. లేచి త్వరగా తెమిలి 6.30కల్లా ఇన్‌స్టిట్యూట్ చేరుకున్నాను. అక్కడ నాలుగు బస్సులున్నాయి. మూడు ల్యూబెక్‌కీ, ఒకటి బ్రెమెన్‌కీ వెడతాయట. అక్కడ అంకుల్ విల్లీ కనిపించి తను బ్రెమెన్ వెడుతున్నానని చెప్పాడు. మా బస్సు 6.45కి బయల్దేరింది. ఓ గంట ప్రయాణం తర్వాత రోజన్బర్గ్ చేరాం. అక్కడో అరగంట హాల్ట్. చూడ్డానికేం లేక బోరనిపించింది. ల్యూబెక్ చేరుకున్నాక, ముందు ఒక చర్చి దగ్గర ఆపారు. నాకైతే శిల్పకళ కోసమైతే తప్ప మామూలుగా ఆలయాలు సందర్శించే ఆసక్తి లేదు. మళ్లీ మళ్లీ చర్చిలు ఏం చూస్తామని నేనంటే మావాళ్లు చాలామంది ఆగిపోయారు. ఈలోగా ఒకతను వచ్చి మాకు ఫ్రీగా బోలెడు బుక్స్, ఫైల్సు ఇచ్చాడు. అందరికీ పంచిపెట్టాం. వాటిని చర్చి చూసి వచ్చిన వాళ్లకు కూడా పంచాం. వినాయకచవితి కదా, స్నానంకోసం మనసు పీకుతోంది. అందుకని ముందు స్నానశాలకు వెళ్లాం. తీరా చూస్తే అది మధ్యాహ్నం ఒంటిగంటకు కానీ తెరవరని తెలిసింది. అప్పటికి టైం పది దాటింది. ఆకలేస్తోంది కడుపులో ఏదైనా పడాలంటారు నటరాజన్, కొరియాలు. "అందాకా ఏ చిప్సయినా, బ్రెడ్డయినా కొనుక్కు తినండి. మనం తెచ్చుకున్న భోజనం మాత్రం స్నానం చేశాకనే" అని రామచంద్ర తేల్చి చెప్పేశాడు. దేవుడంటే భక్తికంటే భయమే ఎక్కువ కదా – నేను, రామచంద్ర ఒంటిగంట దాకా ఏమీ తినమనేసరికి – నటరాజన్, కొరియాలు కూడా ఏమైనా తినడానికి వెనుకాడారు. ఆలోగా ఊరు చూద్దామనుకున్నాం.

"పెద్దగా చూసేదేముంది? అన్ని ఊళ్లూ ఒక్కలాగే ఉన్నాయ్. కలిసి రోడ్లమీద తిరుగుదాం. నదురుగా కనిపించిన చోట ఆగి ఫొటోలు తీసుకుందాం. ఎవరైనా అడిగితే ల్యూబెక్ ఫొటోలు అని చెప్పుకోవచ్చు" అన్నాడు నటరాజన్. అంతా ఏకీభవించాం. కాసేపు ఊళ్లో అక్కడా ఇక్కడా తిరిగి ఫొటోలు తీసుకున్నాం. దేవదార్‌కి కెమేరాలో రీలైపోయింది. వాకబు చేసి ఓ ఫొటో షాపుకి వెళ్లాం. అక్కడ అతను రీలు కొన్నాడు. సేల్స్‌గర్ల్ వస్త్రధారణ జయమాలిని, జ్యోతిలక్ష్మిల తరహాలో ఉంది. ఆమె నడుస్తుంటే మాకు వాళ్ల నృత్యం చూసినట్లే అనిపించి వినోదించాం.

"మన దేశంలో క్లబ్బుడ్యాన్సులు చూడొచ్చని సినిమాలకెడతాం కానీ, ఇక్కడ ఏ షాపుకెళ్లినా క్లబ్బుడ్యాన్సులే" అన్నాడు కొరియా. అలా కాసేపు తిరిగి టైం ఒంటిగంట కాగానే స్నానశాలకు వెళ్లి స్నానాలు చేసొచ్చాం. అందుకు మనిషికి ఒక మార్కు, నలభై ఫెనిగ్సు ఐనా, వేణ్ణీళ్ల సదుపాయం బాగుండి చాలా హాయిగా అనిపించింది. తర్వాత భోజనానికి పార్కుకి వెళ్లాం. వాళ్లవాళ్ల అభిరుచుల్నిబట్టి భోజనాలదగ్గర ఇండియన్సులో ఎవరి జట్టు వారిది. మా జట్టులో ఐదుగురం. అన్నం పొట్లాలు, చిప్సు, పెరుగు తెచ్చుకున్నాం తినడానికి. అన్నంలోకి వంకాయ, సిమ్లామిర్చి (అక్కడ పాప్రికా అంటారు) కూర చేసి తెచ్చాడు రామచంద్ర. ఎలా చేశాడో కానీ అది ఊరగాయకన్నా రుచిగా ఉంది. మూడు పెద్ద పెద్ద సీసాల కూరని మేము ఇట్టే ఊదేశాం. నేనైతే కూర అన్నం, పెరుగన్నం తప్ప – చిప్సు ముట్టలేదు. అంతా రామచంద్రని తెగ పొగిడారు. అదీ మనస్ఫూర్తిగా, కృతజ్ఞతతో.

అక్కడ రోజంతా చలిగానే ఉంది కానీ ఓవర్‌కోటు వేసుకుంటే స్వెటర్‌వల్ల ఉక్కబోస్తోంది. రెండున్నరకి, బస్సులో ట్రావేమ్యుండేకి (టూరిస్ట్ గైడ్) వెళ్లాం. అక్కడ బిశ్వాస్ మమ్మల్ని, "ఈ చలి దేశంలో స్నానాలేమిటి?" అని ఎగతాళి చేశాడు.

"ఆ విషయం ఇక్కడ స్నానశాలలు ఏర్పాటు చేసిన ఈ దేశస్థుల్ని అడుగు" అన్నాను.

అక్కణ్ణించి ఇండియన్సు మళ్లీ జట్లు జట్లుగా విడిపోయాం. మేము బీచ్‌కి వెళ్లాం. ఆ బీచ్ గురించి అంతకుముందే వెళ్లి చూసొచ్చిన కొందరు ఇండియన్సు ఓ వింత విషయం చెప్పారు. అక్కడ ఆడా మగా కూడా నగ్నంగా విహరిస్తారుట. ఐతే దుస్తులు ధరించినవాళ్లెవరైనా దగ్గరగా వస్తే, చటుక్కున నేలమీదకు వాలి బోర్లా పడుకుంటారుట. అదేమి సిగ్గో మరి! వాళ్ల నగ్నవిహారంకంటే అలా బోర్లాపడ్డమే ఎక్కువ ఆశ్చర్యాన్ని కలిగించిందని వాళ్లన్నారు.

ఆ రోజు మాకక్కడ అలాంటి దృశ్యాలేమీ ఎదురవలేదు. బీచి ప్రశాంతంగా ఉంది. కెరటాలు ఇంచుమించు లేవు. స్నానానికి ఆహ్వానిస్తున్నట్లుంది. అక్కడ నేను, రామచంద్ర, తెలుగు జోసెఫ్‌లు కలిసి తిరిగాం. ఆ తర్వాత చెప్పుకోతగ్గ విశేషాలేం లేవు. తిరిగి ల్యూనబర్గు చేరుకునేసరికి 7 అయింది.

*క్రీడాస్ఫూర్తి*

1955లో వచ్చిన మిస్సమ్మ సినిమాలో నందమూరి తారక రామారావుది, నిరుద్యోగిగా దినపత్రిక కూడా కొనుక్కోలేని దశలో ఉన్న పాత్ర. కిళ్లీకొట్టు దగ్గర ఓ యువకుడు కొనుక్కున్న పత్రికకేసి రామారావు ఆబగా చూస్తాడు. “ఓహ్, వాంటెడ్ కాలమ్సా?” అని ఈసడించి ఆ పేజీని అతడికిస్తాడు యువకుడు. అది తీసుకున్న రామారావు, “చదువుకునే రోజుల్లో నేనూ మొట్టమొదట స్పోర్ట్‌స్ కాలమే చూసేవాణ్ణి బ్రదర్” అని నిట్టూరుస్తాడు.

ఆ మాట, ఆ దృశ్యం నన్నెప్పుడూ వెంటాడుతూనే ఉంటాయి. ఐతే చదువుకునే రోజుల్లోనే కాదు, నిరుద్యోగిగా ఉన్నప్పుడూ, ఆ తర్వాత కుటుంబ బాధ్యతలతో తలమునకలౌతున్నప్పుడూ, ఇప్పటికీ కూడా నేను దినపత్రిక రాగానే ముందు చూసేది స్పోర్ట్‌స్ కాలమే. ఆటలంటే అంత ఆసక్తి నాకు. ఆడింది చాలా తక్కువైనా, ఇష్టమైన ఆటల విశేషాల్ని క్రమం తప్పకుండా ఫాలో ఔతాను. నాకిష్టమైన ఆటల్లో అగ్రస్థానం క్రికెట్‌ది. తర్వాతది టెన్నిస్. ఆతర్వాత హాకీ, చదరంగం, బ్యాడ్మింటన్ వగైరాలు. బొత్తిగా ఆసక్తి లేని ఆట ఫుట్‌బాల్.

నేను స్కూల్లో ఎస్ఎస్ఎల్సి చదువుతుండగా, స్కూల్లో ఫుట్‌బాల్ పోటీలయ్యాయి. ఒక జట్టు వారికి ఓ మెంబరు తక్కువై బలవంతాన నన్ను టీములోకి తీసుకున్నారు. పోటీలో మా టీముకి చాలా బలమైన జట్టుతో పడింది. ఐనా మావాళ్లు అసమాన ప్రతిభతో హోరాహోరీగా పోరాడి, ఇంచుమించు చివరిదాకా అవతలి జట్టుని ఒక్క గోలు కూడా చెయ్యనివ్వలేదు. ఆట ఐదు నిముషాల్లో ముగుస్తుందనగా, అవతలి జట్టు ఫార్వర్డు, శరవేగంతో ముందుకు దూసుకొచ్చాడు. అతగాడు గోలు కొట్టేస్తాడేమోనన్న భయంతో నేను గోలు ముందు ఆ బంతిని చటుక్కున చేత్తో పట్టుకుని ఆపాను. రిఫరీ పెనాల్టీ స్ట్రోక్ ఇచ్చాడు. వాళ్లు గోల్ చేశారు. ఆ తర్వాత కొద్ది నిముషాల్లోనూ వాళ్లు మరో మూడు గోల్సు చేశారు. మా జట్టులోని ఒకతను ‘అరచేత్తో ఫుట్‌బాల్’ అంటూ ఆ విషయమై నన్ను కనీసం ఏడాదిపాటు ఏడిపించాడు. మా జట్టు పరాజయానికి పూర్తి బాధ్యత నాదేనన్న అపరాధభావమూ నాలో ఉంది. ఈ చేదు అనుభవం ఆ ఆటపై నాకు విరక్తిని పెంచిందేమో తెలియదు. ఆపైన ఆరేళ్లకి ఆంధ్రా యూనివర్సిటీలో అంతర్విశ్వవిద్యాలయ క్రీడల పోటీలు జరిగినప్పుడు – ఫుట్‌బాల్ ఆటగాళ్ల ప్రదర్శన అద్భుతమై అలరించినా కూడా – ఆ ఆసక్తి తాత్కాలికమైపోయింది.

నాకిష్టమైన ఆటల విశేషాల్ని పేపర్లో వార్తల ద్వారా ఫాలో అయ్యేవాణ్ణి. వీలున్నప్పుడు రేడియోలో కామెంటరీ వినేవాణ్ణి. ఆ ఆటల గురించిన ముఖ్య విశేషాలేమైనా డాక్యుమెంటరీగా వచ్చాయంటే – కేవలం అవి చూడ్డానికే సినిమా థియేటరుకి వెళ్లేవాణ్ణి. అలాంటప్పుడు థియేటర్లో ఏ సినిమా ఆడుతున్నదీ అన్నది ప్రధానం కాదు.

జర్మనీలో క్రికెట్ కామెంటరీ రాదు. క్రికెట్ వార్తలు తెలుసుకుందుకు బిబిసి రేడియోలో స్పోర్ట్‌స్ న్యూస్ వినేవాణ్ణి. ఐతే అక్కడ నేనుండగా ఇండియా ఇంగ్లండ్‌మీద 0–3తో టెస్టు మ్యాచిలు ఓడిపోవడమే కాక, ఒక మ్యాచిలో 42 పరుగుల అతి తక్కువ స్కోరు చెయ్యడం బాధనిపించింది. హాకీలో ఆసియా క్రీడల్లో ఇండియా పాకిస్తాన్‌మీద 0–2తో ఓడిపోవడం కూడా అసంతృప్తిని కలిగించింది. ఐతే టెన్నిస్‌లో నా అభిమాన ఆటగాళ్లు జిమ్మీ కోనర్స్(పురుషుల విభాగం), క్రిస్ ఎవర్ట్(మహిళల విబాగం) వింబుల్డన్ ఛాంపియన్స్ కావడం కొంత సంతోషాన్నిచ్చింది. కానీ నేనూహించని విధంగా వీటన్నింటినీ మించిన ఫుట్‌బాల్ ఆకర్షణ – ల్యూనబర్గులో స్వానుభవమైంది.

నాలుగేళ్లకొకసారి ఫుట్‌బాల్లో ప్రపంచకప్ పోటీలు జరుగుతాయని నాకప్పుడే తెలిసింది. ఆ ఏడాది ప్రపంచకప్ పోటీలకు జర్మనీ వేదిక కావడం విశేషం. అసలు టివియే ఎరుగని నాకు ఆ పోటీల్ని కలర్ టెలివిజన్లో ప్రత్యక్షప్రసారంగా చూసే అవకాశం కలగడం మాటలకందని అనుభూతి.

అంరవరకూ అంతగా పట్టించుకోని ఫుట్‌బాల్ ఆటలో, ఉన్నట్లుండి ప్రపంచస్థాయిలో మేటి ఆటగాళ్ల ప్రదర్శన చూడ్డం గొప్ప అనుభవం. జర్మన్లకి ఫుట్‌బాల్ ఆటపై ఉన్న అమితాసక్తి నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. జూన్ 13నుంచి జూలై 7 వరకూ16 దేశాల మధ్య జరిగిన ఆ పోటీల్లో పశ్చిమజర్మనీది అద్భుతమైన ప్రదర్శన. పశ్చిమ జర్మనీ కెప్టెన్ బెకెన్‌బోవర్, జర్మనీ ఆటగాళ్లలో మ్యుల్లర్ – వీళ్ల పేర్లు జనం నోట ప్రతిరోజూ నానుతూండేవి. పరిసరాల ప్రభావమేమో, ఈ పోటీలు చూస్తుండగా నాలోనూ జర్మన్లకి తీసిపోని ఆసక్తి పుట్టింది.

ఆ పోటీలో తూర్పు, పశ్చిమ జర్మనీలు పరస్పరం తలపడ్డం ఒకే ఒక్కసారి జరిగింది. అందులో తూర్పు జర్మనీ, పశ్చిమ జర్మనీని 1–0 గోల్సుతో ఓడించినప్పుడు పశ్చిమ జర్మనీ దేశం యావత్తూ దిగ్భ్రాంతికి గురి కావడం గ్రహించాను. అది ఇండియా, పాకిస్తాన్‌లాంటి దాయాదుల పోరు కాదు. పశ్చిమజర్మనీ పౌరులకు, తూర్పుజర్మన్లు తమ అనుంగు సోదరులన్న భావన ఉండేది. కమ్యూనిజం వల్ల వారికి స్వేచ్ఛ లేకుండా పోయిందన్న బాధ కూడా ఉండేది. మనసులో వారా పోటీని – కమ్యూనిజానికీ, కాపిటలిజానికీ జరిగిన పోటీగా తీసుకున్నారు. అదే వారి అసంతృప్తికి కారణం.

వరల్‌డ్‌కప్ పోటీలు చూడ్డానికి ఫ్రౌ యాకేల్ నన్ను తన ఇంటికి ఆహ్వానించేది. వీలైనప్పుడల్లా చూసేవాణ్ణి కానీ, ఫైనల్ మాత్రం అక్కడ చూడలేదు.

ఆ రోజు జూలై 7, ఆదివారం. సెలవు రోజు కావడంవల్ల నేనా రోజు ఉదయం పదింటికి ఇంట్లో బయల్దేరి రామచంద్ర ఇంటికి వెళ్లాను. నాతోపాటు అక్కడికి నటరాజన్, సుబ్రహ్మణ్యం, దేవదార్ వచ్చారు. రామచంద్ర అందరికోసం సాంబారన్నం వండిన తీరు ఆసక్తికరంగా గమనించాను. అతను క్యాబేజి, ముల్లంగి, మసూర్‌దాల్, బియ్యం, కొబ్బరి – అన్నీ కలిపి ఉడకబెట్టి అందులో కొంచెం వెన్న వేసి చివర్లో నిమ్మకాయరసం పిండాడు. మేమంతా భోజనం చేస్తూ చాలా కబుర్లు చెప్పుకున్నాం. నేను మాత్రం మాటిమాటికీ టైం చూసుకుంటున్నాను. 4కి ఫుట్‌బాల్లో ఫైనల్స్‌లో జర్మనీ, హాలండ్ దేశాలు తలపడనున్నాయి. రామచంద్రకి ఆటల గురించి మాట్లాడ్డంలో ఉన్న ఆసక్తి చూడ్డంలో లేదు. అతను కాసేపు కూర్చుని వెళ్లమని అందర్నీ నొక్కిస్తున్నాడు. టైం 3 దాటగానే నేను లేచాను. మిగతావాళ్లూ లేస్తుండగా, రామచంద్ర కాఫీ ఆఫర్ చేశాడు. సుబ్రహ్మణ్యానికి కాఫీ బలహీనత. దాంతో మేము బయల్దేరేసరికి పావుతక్కువ నాలుగయింది. ఆదరాబాదరాగా అమ్‌శాండే దగ్గర మార్కెట్ సెంటర్ చేరుకున్నాం. అక్కడ బిశ్వాస్ ఎదురై, మార్కెట్ పూర్తిగా మూసేశారనీ, ఎక్కడా టివి లేదనీ అన్నాడు. చేసేది లేక దగ్గర్లోనే ఉన్న గోతే ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లాం. అదృష్టం కొద్దీ అక్కడ బ్లాక్ అండ్ వైట్‌దయితేనేం టివి ఉంది. ఇక్కడ చూడాలని రాసిపెట్టుంది అనుకుంటూ మేము ఆట చూశాం. జర్మనీ చేసిన ఫౌల్ వల్ల ఆట ఇలా మొదలవగానే అలా మొదటి గోల్ చేసింది హాలండ్. అప్పుడక్కడ హాహాకారాలు చేసినవారిలో మేమూ ఉన్నాం. ఆ తర్వాత కాసేపటికి, పెనాల్టీ ద్వారానే జర్మనీ ఓ గోల్ చేస్తే – తేలికగా నిట్టూర్చినవాళ్లలోనూ మేమున్నాం. మొదటి సగం పూర్తి కావస్తుండగా — గ్రబోవ్‌స్కీ, మ్యుల్లర్ల జంట గోల్ చేసి జర్మనీకి 2–1 ఆధిక్యం సాధించినప్పుడు – ఉత్సాహంతో కేరింతలు కొట్టిన మొదటివాళ్లం మేమే.

ఆడుతున్నది స్వదేశం కాదు. ఆట నాకు ప్రియతమం కాదు. నాలోని ఆ ఉత్కంఠ, ఆ జర్మన్ పక్షపాతం నాకు ఆశ్చర్యం కలిగించాయి. చిత్రమేమిటంటే ఆ తర్వాతనుంచి ఆట వరల్‌డ్‌కప్ ఫైనల్సుకి తగిన స్థాయిలో లేదు. రెండో సగంలో ఏ టీమూ గోల్ చెయ్యలేదు. పశ్చిమ జర్మనీ ప్రపంచకప్ విజేత అయింది. అప్పుడక్కడ మొదలైన ఆ ఉత్సాహం మహోత్సాహమై దేశమంతటా వేడుకలు జరగడం ఈనాటికీ మరిచిపోలేను.

## రోగం ఒక తపస్సు

"జ్వరమొస్తే బాగుణ్ణు. బడికెళ్లక్కర్లేదు" అనేవాడు చిన్నప్పుడు నా క్లాస్‌మేట్ శంకరం. ఇంట్లోవాళ్లు ముద్దు పడేవారు. ఒకరోజు వాళ్లింటికో చుట్టమొచ్చాడు. ఆయనకి కాస్త నోటి దురుసు ఎక్కువ. ఆయన శంకరాన్ని విసుక్కుంటూ, "రోగమొస్తే బడికెళ్లక్కర్లేదు. కానీ స్వర్గానికి పోవాల్సుంటుంది" అన్నాడోసారి. అప్పట్నించీ ఆ మాట జోక్‌గా మారి తరచు వాడుతుండేవాళ్లం. కానీ ఒకరోజు ల్యూనబర్గులో క్రంకెన్ హౌస్‌కి (హాస్పిటల్) వెళ్లినప్పుడు ఆ మాట మరోవిధంగా నిజమనిపించింది.

హాస్పిటల్ భవనం విశాలంగా, అందంగా, పరిశుభ్రంగా, దివ్యంగా ఉంది. నర్సులు అప్సరసల్లా ఉన్నారు. వైద్యులు అశ్వినీ దేవతల్లా ఉన్నారు. రోగులు అమృతపానం చేస్తూ, సమస్త సుఖాలూ అనుభవిస్తున్న దేవతల్లా ఉన్నారు. ఇండియాలో ప్రభుత్వ ఆస్పత్రి నరకాన్ని తలపింపజేస్తే, ఇక్కడి ఆస్పత్రి సాక్షాత్తూ స్వర్గంలా ఉంది. రోగం ఆ స్వర్గానికి వెళ్లడానికి చేసిన తపస్సు అనిపించింది.

ఈ భావాలతో ఒకో విభాగమే చూస్తూ పిల్లల విభాగానికి వచ్చాం.

అక్కడ నెలల వయసు చంటిపిల్లల నుంచి, అయిదేళ్ల బాలబాలికల వరకూ ఉన్నారు. వాళ్లు ఎవరికివారు విడివిడిగా చిన్న చిన్న అద్దాల విభాగాల్లో ఉన్నారు. వాళ్లక్కడ ఆడుకుందుకు రకరకాల బొమ్మలు, ఆటవస్తువులు ఉన్నాయి. తినడానికి రకరకాల తినుబండారాలు తగినన్ని ఉన్నాయి. వేళ ప్రకారం మందులిచ్చి వెళ్లే నర్సు ఉంది. పడుకుందుకు మెత్తని పరుపులున్నాయి. తోడుకు పక్కన మనుషులు మాత్రం లేరు.

ఆ పిల్లలు అద్దాల గదుల్లో ఉన్నారు కాబట్టి వచ్చేపోయేవారు వాళ్లని చూడొచ్చు. రోజుకొకసారి తలిదండ్రులు కూడా వచ్చి పిల్లల్ని చూసి వెడతారు. అంత చిన్న వయసులో, అందులోనూ జబ్బు పడ్డప్పుడు, అలా ఒంటరిగా పిల్లల్ని వదిలిపెట్టి ఉండడం, మనదేశంలో తలిదండ్రులు ఊహలోనైనా భరించగలరా?

చిన్నప్పుడు నావంట్లో కాస్త నలత చేస్తే చాలు – రాత్రింబవళ్లు కళ్లలో వత్తులు పెట్టుకుని సేవలు చేసిన అనురాగమూర్తి, ప్రేమమయి అమ్మ చటుక్కున నాకు గుర్తొచ్చింది. ఆ పిల్లల్ని చూస్తే మనసు కలుక్కుమంది.

"అనారోగ్య సమయంలో పిల్లలకి వైద్యమూ, వైద్యసదుపాయాలూ మాత్రమే కాదు. అయినవాళ్ల సమక్షం కూడా అవసరం" అన్నాను అప్రయత్నంగా. అప్పుడే నాకో అనుమానమొచ్చింది. స్వర్గానికి వెళ్లిన పెద్దలకు విలాస జీవితం గ్యారంటీ. మరి చిన్నపిల్లలు స్వర్గానికి వెడితే?

బహుశా వారి జీవితం ఇలాగే ఉంటుంది కాబోలు....

## నీమీద మనసాయెరా

'నీమీద మనసాయెరా" అన్న మాట విన్నప్పుడు ఏ పురుషుడికైనా తనువు పులకరిస్తుందంటారు. కానీ ఆ మాట వింటేనే నిలువెల్లా వణికిపోయే సంఘటన ఒకటి నా అనుభవంలోకి వచ్చింది.

అనుభవాలు ఎంత కొత్తవైనా కూడా, ఎంతో కొంత ఊహకి అందొచ్చు. కానీ ఈ అనుభవం ఏ విధంగానూ నా ఊహకందనిది.

జూలై 25. జర్మనీలో అడుగుపెట్టి ఏడువారాలయింది.

ఆ రోజు ఉదయం ఒక జర్మన్ వృద్ధుడు గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చాడు. బ్రేక్‌ఫాస్ట్ అయ్యేక మమ్మల్ని కలుసుకున్నాడు. ఆయన ఇండియాలో చాలా కాలం ఉన్నాడట. మద్రాసులో ఉండేవాడుట. అందుకని తమిళం బాగా వచ్చునట. ఆయన తమిళం మాట్లాడుతుంటే తమిళుడి నోట వింటున్నట్లే ఉంది.

ఆయన మమ్మల్ని చూసి, "నమస్కారం" అన్నాడు. ఉచ్చారణ తమాషాగా అనిపించింది.

రామచంద్ర రెచ్చిపోయి ఆయనతో అరవంలో కబుర్లు మొదలెట్టాడు. కానీ ఆయనకి తమిళం మాట్లాడ్డం ముఖ్యం కానట్లుంది. అందరితోనూ మాట్లాడ్డానికి, తొందరగానే ఇంగ్లీషులోకి దిగిపోయాడు. మమ్మల్ని ఆకట్టుకుందుకు ఇండియాలో తన అనుభవాలు కొన్ని చెప్పాడు.

మద్రాసులో ఉన్నప్పుడు ఆయనకి ఓ పల్లెటూరి రైతుతో పరిచయమయిందిట. ఆ రైతు విద్యాధికుడే కానీ, పల్లెటూళ్లోనే స్థిరపడి వ్యవసాయం చేస్తున్నాడుట. అతనోసారి ఈయన్ని తన ఊరు తీసుకెళ్లాడుట. ఆ రైతు కవిత్వమంటే చెవి కోసుకుంటాడుట. ఎంతలా అంటే – తన ఎడ్లకు గ్యోతే, షీలర్ అని పేర్లు పెట్టుకున్నాడుట. ఈయన్ని రెండెడ్ల బండెక్కించుకుని – తన ఎడ్లని గ్యోతే, షీలర్ అని అదిలిస్తుంటే ఈయనకి ముందు బాధగా అనిపించిందిట. అయితే ఆ రైతు ఆ పేర్లు అభిమానంతో పెట్టుకున్నవని గ్రహించేక అ బాధ పోయింది.

కథ చెబుతూ ఆయన తనే పడిపడి నవ్వాడు. అంతలా కాకపోయినా మేమూ కొంత నవ్వాం.

ఆ కథవల్ల ఆయన నాకు బాగా గుర్తుండిపోయాడు. అంతటితో పరిచయం అయిపోయిందనుకున్నాను.

ఆరోజు సాయంత్రం ఇంటికెళ్లేసరికి కాస్త అలస్యమైంది. నేను వెళ్లి తలుపు తీస్తుండగా, వైయాంగ్ గది తలుపు తెరుచుకుంది, వైయాంగ్ కానీ నాకోసం వస్తున్నాడా అనుకున్నాను కానీ బయటికొచ్చింది ఉదయం మమ్మల్ని పలకరించిన జర్మన్ వృద్ధుడు. అతని వెనుకనే వైయాంగ్ గది తలుపు మూసుకుంది.

ఆయన నా దగ్గరకొచ్చి, “వణక్కం” అన్నాడు. నేనేదో అనేలోగానే తమిళంలో మాటలు మొదలెట్టాడు.

నేను ప్రతి నమస్కారం చేసి, నాకు తమిళం అర్థం కాదని చెప్పాను, అతను వెంటనే, “నమస్కారం” అని ఇంగ్లీషులోకి దిగిపోయాడు.

ఆయన వచ్చింది నాకోసమేనని తెలిసి ఆశ్చర్యపోతూనే, నా గదిలోకి ఆహ్వానించాను.

ఆయన నా గదిలోకొచ్చి కాసేపు ఆ కబురూ ఈ కబురూ చెప్పి చటుక్కున నాకు దగ్గరగా జరిగాడు. “మై సన్, మై సన్” అంటూ నన్ను గట్టిగా కౌగలించుకున్నాడు. ఉడుకులాం వాసన గుప్పుమంది.

ఆయన శరీరం వణుకుతోంది. ముఖం ఎర్రబడింది. కళ్లలో ఉద్రేకం కనబడుతోంది.

నాకేదో అనుమానమొచ్చి, చటుక్కున ఆయన్ని విడిపించుకుని దూరంగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను.

“నేను నీకు తండ్రిలాంటివాణ్ణి. దగ్గరగా వచ్చి కూర్చో” అన్నాడాయన.

“ఫరవాలేదు. ఇక్కడే కూర్చుంటాను” అన్నాను.

“దగ్గరగా కూర్చుంటే బాగోలేదా?” అన్నాడతను.

“అన్‌కంఫర్టబుల్‌గా ఉంది” అన్నాను.

“మరి మీ ఇంట్లో నీ తండ్రికి దగ్గరగా కూర్చోవా నువ్వు?” అన్నాడతను.

“తండ్రికి పాదాభివందనం చెయ్యడం మా సంప్రదాయం. కౌగలించుకునే అలవాటు నాకు లేదు” అన్నాను.

ఏమనుకున్నాడో, “నేను హోమో సెక్సువల్నని అనుమానిస్తున్నావా?” అన్నాడాయన.

అలాంటి అనుమానం వచ్చిన మాట నిజమే కానీ, ఆయనలా సూటిగా అడిగెయ్యగానే మొహమాటపడి, “లేదు. కానీ నీకు దగ్గరగా కూర్చోలేను” అన్నాను.

“ఇండియాలో మగాళ్లూ మగాళ్లూ కలిసి పడుకోవడం సాధారణం అని విన్నాను. నిజం కాదా?” అన్నాడాయన వెంటనే.

“నిజం కాదు. ఇండియాలో మగవాళ్లకు ఆడవాళ్లంటే పెద్ద సస్పెన్సు ఉంది. అక్కడ వయసొచ్చిన మగాడు – ఆడదానితో అనుభవంకోసం అత్రుతగా ఎదురు చూస్తాడు. అవకాశాలు అంత సులభంగా దొరక్క, ఆడదానిపట్ల అమితంగా ఆసక్తి, ఆకర్షణ ఉంటాయి మగాడికి. పాశ్చాత్యదేశాల్లో అలాకాదు. ఆడవాళ్లు వళ్లు దాచుకోవాలని అనుకోరు. వెంటపడ్డ మగాళ్లతో స్నేహం, చనువు చూపే ఆడవాళ్లని ఇక్కడి సమాజమూ అంతలా వేలెత్తి చూపదు. కానీ కామానికి మితిమీరిన స్వేచ్ఛ లభించడంతో, అది వెర్రితలలు వేసి హోమోసెక్సువలిటీ లాంటివి బయల్దేరి ఉండొచ్చిక్కడ” అన్నాను కాస్త తీవ్రంగా.

నిజానికీ విషయం గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. స్థిరమైన అభిప్రాయమంటూ ఏర్పరచుకోవాల్సిన అవసరమూ రాలేదు. ఆయన ప్రవర్తన నన్ను హర్ట్ చేసింది. డోసు బలంగా ఇచ్చి ఆయన్ని వదిలించుకోవాలనిపించి నోటికొచ్చినదేదో అనేశాను.

ఆయనింకా వదిలేలా లేడు, "నీకేమైనా డబ్బుకి ఇబ్బందిగా ఉందా?" అన్నాడు సంభాషణ దారి మళ్లిస్తూ.

"నాకొచ్చేదాంతో సుఖంగా గడిచిపోతోంది. ఏ ఇబ్బందీ లేదు" అన్నాను సంతృప్తిని ముఖంలో కూడా వ్యక్తపరిచేందుకు ప్రయత్నిస్తూ.

ఆయన ఒక్క క్షణం మౌనం వహించాడు. తర్వాత తనేదో స్కూలు నడుపుతున్నాననీ, అక్కడికొచ్చి ఇండియా గురించి ఏదైనా లెక్చర్ ఇమ్మనీ ఆహ్వానించాడు. సరేనన్నాను.

"చాలా మొండివాడిలాగున్నావు. పట్టుమని ఇరవై ఏళ్లున్నట్లు లేదు. ఇండియనువి. కాబట్టి నా అనుమానం, ఇంతవరకూ నీకు స్త్రీ అనుభవం లేదని!" అన్నాడాయన.

"నా వయసు ముప్పై. నాకిద్దరు పిల్లలు" అన్నాను చప్పున.

ఆయన షాక్ తిన్నట్లు కనబడ్డాడు. "అయ్ థాట్ యు ఆరే బాయ్" అని నెమ్మదిగా గొణిగాడు. ఓ క్షణమాగి, "నువ్వు అబద్ధం చెబుతున్నావు కదూ!" అన్నాడు. ఔనంటానన్న ఆశ ఆయన కళ్లలో కనబడుతోంది.

"అబద్ధం కాదు, నిజమే! కావాలంటే నా ఫామిలీ ఫొటో చూడు" అంటూ పక్కనే బల్లమీద పుస్తకాల వెనకున్న ఫొటో తీసి చూపించాను.

చూశాడు. మళ్లీ ఏదో అస్పష్టంగా గొణుక్కుని, "ఒక్కసారి దగ్గరగా రాలేవా?" అని బ్రతిమాలుతున్నట్లు అడిగాడు.

"రాలేను" అన్నాను కాస్త కటువుగా.

"సరే, ఐతే సెలవు" అని ఓ క్షణమాగి, "నీ క్లాసులో ఎవరైనా ఇరవైఏళ్ల కుర్రాళ్లున్నారా?" అనడిగాడు.

మా క్లాసులో అబూరాసీ అనే ఇరవైఏళ్ల టర్కిష్ కుర్రాడున్నాడు. అతని పేరు చెప్పాను.

ఆయన లేచి నిలబడ్డాడు. నేనూ లేచాను.

చటిక్కున ఒక అడుగు ముందుకేసి మళ్లీ నన్ను బలంగా కౌగలించుకున్నాడు. అదేం జబ్బో తెలియదు కానీ, మనిషి నన్ను కౌగలించుకున్నంతసేపూ నిలువెల్లా వణికిపోతున్నాడు.

నేను అసహ్యంతో ముడుచుకుపోయాను. బలమంతా ఉపయోగించి విడిపించుకున్నాను.

"నీకు చాలా ఇబ్బందిగా ఉన్నట్లుంది. ఇక సెలవు తీసుకుంటాను. వచ్చే ఆగస్ట్ 14న నా స్కూలు తెరుస్తాం. అప్పుడు నీకు కబురు చేస్తాను. ఇప్పటికి ఇండియన్ పద్ధతిలో సెలవు తీసుకుంటాను" అంటూ రెండు చేతులూ జోడించి, "నమస్తే!" అన్నాడు.

ఆయన తలుపు తీసుకుని వెళ్లిపోగానే, నేను పక్కరూంలో వైయాంగ్ దగ్గరకి పరుగున వెళ్లాను.

"వైయాంగ్! ఆ ముసలాడు నీ గదికెలా వచ్చాడు?" అన్నాను.

"వాడు మంచాడు కాదు. పైగా చాలా ప్రమాదకరమైన మనిషి. హోమో సెక్సువల్" అన్నాడు వైయాంగ్అదోరకమైన ఏహ్యాభావంతో.

ఆయన వైయాంగ్‌తో నేరుగానే బేరానికి దిగేట్ట. చాలా డబ్బు ఇస్తానన్నాట్ట.

వైయాంగ్ నాకంటే బాగా కుర్రవాడు. స్పందనలో నాకున్న పరిణతి అతనికుండదు. ఇంచుమించు గెటౌట్ అని చెప్పి వదుల్చుకున్నాట్ట.

నా అనుమానం నిజమేనని రూఢి కాగానే వణికిపోయాను. జీవితంలో ఇలాంటి అనుభవానికి అస్కారం ఉండొచ్చని కలలో కూడా అనుకోలేదు.

నా గదికి వెళ్లి తలుపులు వేసుకున్నాను. ముసలాడు వచ్చి వెళ్లడం నిజమేననడానికి సాక్ష్యంగా గదిలో ఉడుకులాం వాసన ఇంకా తాజాగానే ఉంది.

ఆయన నామీద మనసై వచ్చాడన్నది నిజం. ఆ నిజం ఇప్పటికీ ఎప్పటికీ నా ఊహ కందనిది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments